## క్లుప్తంగా

### సద్వినియోగం చేసుకోండి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మురళి

**పెద్దపంజాణి:** ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దపంజాణి ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి టి.మురళి అన్నారు. మండలంలోని బట్టందొడ్డి గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వివిధ వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యపరీక్షలు చేశారు. ఎంఎల్ హెచ్‌పీ అరుణకుమారి, ఏఎన్ఎం వసంతకుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### విద్యార్థులకు మొక్కల పంపిణీ



పండ్ల మొక్కలతో విద్యార్థులు, నిర్వాహకులు

**పలమనేరు:** మండలంలోని డొడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పట్టణానికి చెందిన ప్రకృతి కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర పలు రకాల పండ్ల మొక్కలను గురువారం పంపిణీ చేశారు. వీటిని విద్యార్థులు ఇంటి వద్ద పెంచి పరిరక్షించాలని సూచించారు. పిల్లల ఇష్టాన్ని బట్టి జామ, నిమ్మ, అల్లనేరేడు మొక్కలను అందజేశారు. నా చెట్టు.. నా గాలి నినాదంలో భాగంగా బెంగళూరుకు చెందిన యక్షవారి సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నేడు అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

**పలమనేరు:** పలమనేరు ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, మినీఅంగన్‌వాడీ, ఆయా పోస్టులకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నేటి ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు స్థానిక సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

### మున్సిపాలిటీలో ఆకస్మిక తనిఖీలు



జంతువధశాలను పరిశీలిస్తున్న రమణారెడ్డి

**పలమనేరు:** పట్టణంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. పారిశుధ్య చర్యల్లో భాగంగా పలు డ్రైన్లు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలు, జంతువధశాలలు, దుకాణాల వద్ద పరిశుభ్రతను గమనించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంటు వ్యాధులు ప్రబలకుండా పట్టణవాసులు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఆయన సూచించారు.

### ఆధార్ కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి

**సదుం:** మండలంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాజశేఖర్‌బాబు సూచించారు. ఈకేంద్రాల్లో ఆధార్‌లో వివరాల మార్పులు, ఐదేళ్లలోపు వారికి కొత్త కార్డులు మంజూరు చేస్తారన్నారు. ఇప్పటికే తిమ్మానాయనపల్లె, అమ్మగారిపల్లె, కంభంవారిపల్లెలో కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 26న ఊటుపల్లె, 27న పాలమంద గ్రామ సచివాలయాల్లో కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు.

### సకాలంలో బిల్లులు తీయాలి

**చిత్తూరు కార్పొరేషన్:** విద్యుత్ బిల్లులు సకాలంలో తీయాలని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. గాంధీరోడ్డులోని ఈఈ కార్యాలయంలో గురువారం బిల్లు రీడర్స్‌తో సమావేశమయ్యారు. ప్రతినెలా 8వ తేదీలోపు విద్యుత్ రీడింగ్‌ను పూర్తిచేయాలన్నారు. రీడింగ్ సమయంలో ఇల్లు తాళం వేసి ఉంటే మరోసారి రావడం లేదా వినియోగదారులకు ఫోన్ చేసి మాట్లాడాలని సూచించారు. బిల్లు ఇచ్చిన 15 రోజుల వరకు ఎటువంటి జరిమానా లేకుండా చెల్లించే అవకాశం ఉందని వివరించారు. డీఈలు జ్ఞానేశ్వర్, శేషాద్రి, ఏఈలు పాల్గొన్నారు.

### రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

**పుంగనూరు:** పట్టణంలోని తాటిమాకులపాళెంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఈనెల 27న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు చెంగారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ చెన్నైకి చెందిన శంకర నేత్రాలయ వారిచే ఉదయం 9 గంటల నుంచి శిబిరం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# తగ్గిన వేరుశనగ సాగు

- విత్తనాలేసేందుకు ఆసక్తి చూపని రైతులు
- సగానికి తగ్గిన పంటసాగు విస్తీర్ణం



పలమనేరు వద్ద వేరుశనగ పంట

**పలమనేరు:** పేదవాని పంటగా పేరొంది వర్షాధారంగా సాగయ్యే వేరుశనగ పంట సాగు పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలో ఏటా తగ్గుముఖం పడుతోంది. ఈ ప్రాంతంలో సగానికిపైగా రైతులకు ఖరీఫ్‌లో వేరుశనగే జీవనాధారంఅయితే పెరిగిన పంట పెట్టుబడి, కూలీల సమస్య, పంట దిగుబడి తగ్గడంతో దానికి దానికి సరిపోతోందని, దీంతో తమ కష్టం నేలపాలవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పర్యాయం సకాలంలోనే వర్షాలు కురిశాయి. సబ్సిడీ విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేశారు. కానీ విత్తనాలను తీసుకున్న సగం మంది రైతులు వాటిని గానుగ ఆడించి వేరుశనగ నూనెకు వాడుకున్నారు. మరికొందరు తినేందుకు పెట్టుకున్నారు. ఫలితంగా డివిజన్‌లో వేరుశనగ సాగు సగానికి పడిపోయింది.

**ఏటా తగ్గుతున్న పంట విస్తీర్ణం..**

పలమనేరు డివిజన్‌లో వేరుశనగ సాగు సాధారణ విస్తీర్ణం 19,975 హెక్టార్లుగా ఉంది. 2018లో 14,050, 2019లో 14,300, 2020లో 13,200, 2021లో 13వేలు, 2022లో 12,900, 2023లో 12,950 కాగా ఈ పర్యాయం7,100 హెక్టార్లకు తగ్గింది. పంట మధ్యలో డ్రైస్పెల్స్, పూత, ఊడ దశలో వర్షం పడక పంట ఎండడం, వేరుశనగ పంట ఒబ్బిళ్ల సమయంలో వర్షాలు ఇతర కారణాలతో రైతుకు నష్టాలు తప్పలేదు. అయితే ఈసారి మే నెలలో వర్షాలు కురిశాయి. అయితే పలువురు రైతులు దుక్కులు దున్నకమే చేపట్టలేదు. ఉన్న పంట దిగుబడి బాగా రావాలంటే ఆగస్టులో వర్షాలు పడాల్సిన అవసరం ఉంది. ఈసారి దిగుబడులు తగ్గుముఖం పడితే వచ్చే ఏడాది సాగు మరింతగా తగ్గడం ఖాయం.

**ఎకరానికి పది బస్తాల దిగుబడి వస్తేనే...**

సాధరణంగా ఎకరా పొలంలో వేరుశనగ మంచి దిగుబడి వస్తే పది బస్తాల వస్తాయి. అయితే గత కొన్నేళ్లుగా ఎకరా పొలంలో సగటు దిగుబడి 7 బస్తాలకు దిగింది. దీంతో రైతులకు నష్టాలు తప్పడం లేదు. ఈ ఖరీఫ్‌లో వేసిన పంట ఇప్పటి దాకా బాగుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఇంకో 15 రోజులు తేమ లభిస్తుంది. ఈవర్షంతో ఊడలు కాయలుగా మారతాయి. ఆపై ఆగస్టులో మరో వర్షం పడితే ఒబ్బిళ్లు అయినట్టే.

## కొత్త రవాణా చట్టాన్ని రద్దు చేయాలి

**పుంగనూరు:** ఆటో కార్మికులకు ఉరి తాడులా ఉన్న కొత్త రవాణా చట్టాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వాడా గంగరాజు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వం రవాణా రంగాన్ని నడ్డివిరుస్తోందని ఆరోపించారు. కార్మికులకు నష్టం కలిగించే చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తామన్న కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులు నష్టపోకుండా చూడాలన్నారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

**నూతన కార్యవర్గం...**

పట్టణ ఆటో కార్మిక సంఘ అధ్యక్షుడిగా మస్తాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా మౌల, ఉపాధ్యక్షులుగా మంజునాథ్, నూర్ షా, సహాయ కార్యదర్శులుగా అహ్మద్‌బాషా, ప్రసాద్, బాబు, కోశాధికారిగా ఇమ్రాన్‌తో పాటు 9 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## విద్యార్థి దశ కీలకమైనది



బహుమతులు అందుకున్న విద్యార్థులు

**వి.కోట:** మానవ జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమైనదని, ఈదశలో చదువును కష్టంతో కాక ఇష్టంతో చదివితో ఎంతో ఉన్నతమైన స్థితికి ఎదగవచ్చని ఎంఈఓ–2 మురుగేష్ సూచించారు. గురువారం మండలంలోని కర్రిపల్లి పాఠశాలలో జాతీయ విద్యావిధానం ప్రారంభమై నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నాల్గవ రోజు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు కోలాటాలు, చెక్కభజన ప్రదర్శించారు. అనంతరం చెక్కభజన కార్యక్రమానికి ఆ పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు వెంకటేష్ ప్రోత్సాహక బహుమతిగా రూ.5 వేలు విరాళంగా అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లంపి సోకకుండా జాగ్రత్తలు



పాడి రైతులకు సూచనలిస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

**చౌడేపల్లె:** పశువులకు ముద్దచర్మ వ్యాధి (లంపి) సోకకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. గురువారం చిట్రెడ్డిపల్లెలో పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పశువులకు బూటాక్స్ పిచికారీ చేశారు. గర్భకోశ వ్యాధితో బాధపడుతున్న పశువులకు వైద్యసేవలందించి తగిన సూచనలు రైతులకు తెలియజేశారు. ముద్దచర్మ వ్యాధి సోకకుండా పశువుల పాకలో వేపాకు పొగవేయాలన్నారు. ఉచితంగా ముద్దచర్మ వ్యాధి నివారణకు ప్రభుత్వం టీకాలు వేయిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కృత్రిమ కాలుకు దరఖాస్తులు

**గుడుపల్లె:** విభిన్న ప్రతిభావంతులు కృత్రిమ కాలు ఏర్పాటు చేసుకునేందుకు నేడు శుక్రవారంలోపు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ గోపి తెలిపారు. చెన్నైలోని ఫ్రీడమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాళ్ల క్యాంపులో కాలు కొలతలను తీసుకుని 20 రోజుల తరువాత వారికి రూ.51 వేల విలువ చేసే వెయిట్ లెస్ కృత్రిమ కాలును ఉచితంగా అమర్చుతారన్నారు. దరఖాస్తులు చేసుకునే ప్రతిభా వంతులు ఆధార్, రేషన్ కార్డు, సదరన్ సర్టిఫికెట్ రెండు జిరాక్స్ సెట్లు, వికలత్వం కనిపించే రెండు ఫొటోలు ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

## పాత కలెక్టరేట్ పరిశీలన



రికార్డు రూమును పరిశీలిస్తున్న డీఆర్‌ఓ

**చిత్తూరు కలెక్టరేట్:** నగరంలోని గిరింపేటలో ఉన్న పాత కలెక్టరేట్‌ను డీఆర్‌ఓ పుల్లయ్య ఆకస్మికంగా గురువారం పరిశీలించారు. పాతకలెక్టరేట్ ఆవరణలో ఉన్న పలు కార్యాలయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాత కలెక్టరేట్‌కు ఎంతో చరిత్ర ఉందన్నారు. పోలీసు సెక్యూరిటీ, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కింది స్థాయి సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అక్కడే ఉన్న ఉమ్మడి చిత్తూరు జిల్లా పాత రెవెన్యూ రికార్డులు భద్రపరిచిన భవనం పరిశీలించారు.

## బోధన సామగ్రి వితరణ



గడ్డంవారిపల్లెలో బోధన సామగ్రిని ఇస్తున్న దాత

**చౌడేపల్లె:** మండలంలోని ఎనిమిది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 206 మంది విద్యార్థులకు తెల్లనీళ్లపల్లెకు చెందిన నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గువ్వల కేశవరెడ్డి సహకారంతో బోధన సామగ్రిని వితరణగా అందజేశారు. గురువారం ఎంఈఓ కేశవరెడ్డి, తెల్లనీళ్లపల్లె, నాగిరెడ్డిపల్లె, బత్తలాపురం, సామిరెడ్డిపల్లె, మల్లెలవారిపల్లె, ఉన్నత పాఠశాల, పరికిదొన, సింగిరిగుంట ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు అందజేశారు. నోట్‌పుస్తకాలు, పెన్నులు, ప్యాడ్‌లు, పలకలు, పెన్సిళ్లు, స్కెచ్‌పెన్నులు అందజేశారు. వీటి విలువ రూ.1.50 లక్ష ఉంటుందని తెలిపారు. దాతకు విద్యార్థులు, తల్లితండ్రులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థినులకు సైకిల్ స్టాండ్



సైకిల్ స్టాండ్

**పుంగనూరు:** స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో దాత విజయభాస్కర్‌రాజు సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేశారు. గురువారం స్థానిక మేస్త్రీ వెంకటరాజు కుమారుడు సివిల్ ఇంజినీర్ విజయభాస్కర్‌రాజు రూ.50వేలు ఖర్చు చేసి సైకిల్ స్టాండ్‌ను ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ కమలాకర్ ఆధ్వర్యంలో సైకిల్‌స్టాండ్‌ను ప్రారంభించారు.

# శనగ చేతికందేనా?

- వేరుశనగ పంటను సర్వనాశనం చేస్తున్న అడవి పందులు
- నివారించేందుకు చేస్తున్న ప్రయత్నాలు విఫలం
- అయోమయంలో అన్నదాతలు



అడవి పందులు ధ్వంసం చేసిన వేరుశనగ పంట

**కుప్పం:** ఓ మోస్తరు వర్షాలతో భూమిలో వేసిన వేరుశనగ విత్తనం చేతికందుతుందని ఆశపడిన రైతులకు నిరాశే మిగులుతోంది. పూర్తి స్థాయిలో వేరుశనగ పంట దిగుబడి ఆశించిన స్థాయిలో ఉన్నా పంటను రైతులు కాపాడలేకపోతున్నారు. నిత్యం రాత్రి వేళల్లో అడవిపందుల దాడులతో పంటలు నాశమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని నివారించేందుకు రైతులు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నాయి.

**ఆశాజనకంగా వేరుశనగ**

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నా రైతులు వేరుశనగ పంటపై మొగ్గు చూపారు. ఎప్పుడూ లేని విధంగా ఈ సారి నాలుగు మండలాల్లో 5 వేల హెక్టార్లలో పంటను సాగు చేశారు. వర్షాలు మోస్తరుగా కురవడంతో పంట ఆశాజనకంగా ఉంది. దిగుబడి పెరిగి లాభాలు వస్తాయని ఆశపడుతున్న రైతులకు అడవిపందులు తీవ్ర నష్టాలను మిగుల్చుతున్నాయి. ఒక ఎకరా పొలానికి విత్తనం, దుక్కిదున్ని పంట వేసేందుకు రూ.10 వేల వరకు రైతులు వెచ్చిస్తుంటారు. వర్షాలు రావడంతో పూర్తిస్థాయిలో పంట చేతికి అందుతుందని ఆశ పడుతున్నారు.

**అడవి పందుల దాడులు..**

వేరుశనగ పంట చేతికొచ్చే సమయంలో అడవిపందులు పంట పొలాలపై దాడులు చేసి తీవ్ర నష్టాలకు గురిచేస్తున్నాయి. వేరుశనగ చెట్లను పూర్తిగా ధ్వంసం చేసి కేవలం వేరుశనగను మాత్రం తినేసి వెళుతున్నాయి. చేసిన కష్టానికి కూలి ఖర్చు అయినా వస్తుందని ఆశపడిన రైతులకు నిరాశే మిగులుతోంది. వీటి నివారణ కోసం వేరుశనగ పొలాల చుట్టూ రంగురంగు దుస్తులు చుట్టి బాణసంచా పేలుస్తున్నా వీటి బారి నుంచి తప్పించుకోలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవిపందులతోపాటు, కోతుల బెడద తీవ్రంగా మారింది. పంట బాగా వచ్చి పంట నూర్పిడి సమయానికి పందులు, కోతుల బెడదతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వీటిపై అటవీ శాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నాం..**

పొలాల్లో సాగు చేసిన వేరుశనగ పంటను వర్షం కొంతమేర దెబ్బతీసింది. పంట దిగుబడి చేతికందుతుందని ఆశపడుతున్న తరుణంలో అడవిపందులు పంటను ధ్వంసం చేస్తున్నాయి. రోజూ పంట పొలాల వద్ద కాపలా కాస్తున్నా అడవి పందులను మాత్రం కట్టడి చేయలేకపోతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి.

–శ్రీనివాసులు, రైతు, మల్లానూరు

**ఆశలు అడియాశలయ్యాయి..**

వానలు లేక వ్యవసాయం పూర్తిగా దెబ్బతీసింది. వేసిన వేరుశనగ పంట కొంతైనా చేతికందుతుందని అనుకుంటే ఆశలన్నీ నిరాశలవుతున్నాయి. అడవి సరిహద్దులో ఉన్న పొలాల్లో వేరుశనగ పంట పూర్తిగా చేతికందే పరిస్థితి లేదు. అడవి పందుల దాడులతో పంటంతా ధ్వంసమవుతున్నాయి. తీవ్రంగా నష్టపోతున్నాం. అధికారులు సమస్యకు పరిష్కారం చూపాలి.

–దేవరాజులు, రైతు, కంగుంది

## ఘనంగా సాంస్కృతిక దినోత్సవం



వివిధ వేషధారణలో విద్యార్థులు

**పెద్దపంజాణి:** మండలంలోని నాగిరెడ్డిపల్లి ఎంపీయూపీ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా గురువారం సాంస్కృతిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ఎంఈఓ గోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వమని ప్రతి రాష్ట్రంలో స్థానిక భాష, సంప్రదాయాలు, కట్టుబాట్ల సంస్కృతి ఘనంగా మేళవించి ఉంటాయని వివరించారు. హెచ్ఎం బాబురెడ్డి మాట్లాడుతూ భావిభారత పౌరులుగా విద్యార్థులందరూ దేశాన్ని ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్‌గా గుర్తించాలని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల సంస్కృతిని, వారి వేషధారణను ప్రతిబింబించేలా విద్యార్థులచే కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీనాక్షి, వాణిశ్రీ, అంజప్ప, రాజేష్‌బాబు, గంగాధర్, మాధవన్ పాల్గొన్నారు.

## ఇక ఇబ్బందులుండవు

- కర్ణాటక ఆర్టీసీ అధికారులతో మాట్లాడిన పలమనేరు డీఎం

**పలమనేరు:** ఇకపై పలమనేరు ప్రయాణికులకు కేఎస్‌ఆర్టీసీ బస్సుల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అటు బెంగళూరు నుంచి ఇటు తిరుపతి నుంచి కచ్చితంగా పలమనేరు ప్రయాణికులను ఎక్కించుకోవాలని, బైపాస్‌లో కాకుండా టౌన్‌లోకి బస్సులు వచ్చేలా కేఎస్‌ఆర్టీసీ అధికారులతో చర్చించి సమస్యకు పరిష్కారం చేశామని స్థానిక ఆర్టీసీ డీఎం టీకే స్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన పలమనేరా...దిగు దిగు అనే శీర్షికపై స్థానిక డీఎం స్పందించి బెంగళూరులోని కేఎస్‌ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఈ సమస్యను తెలిపినట్టు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన అక్కడి అధికారులు ఈ మార్గంలో ప్రయాణించే అన్ని కర్ణాటక ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లకు లిఖిత పూర్వకంగా ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు.

## వేడుకగా రుద్రాభిషేకం



హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

**గుడుపల్లె:** గుడివంక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో లోకకల్యాణం కోసం రుద్రాభిషేకాన్ని వేద పండితులు గురువారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి అనంతరం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక అలంకరణం చేసి పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ ఆవరణలోని యాగశాలలో పూర్ణకుంభంతో పాటు వివిధ రకాల అమ్మోర్లను ఏర్పాటు చేసి కలశ స్థాపన చేసి ప్రాణప్రతిష్ఠ చేశారు. హోమాలు ఏర్పాటు చేసి వేద పండితుల మంత్రోచ్ఛరణలతో యాగాలను పూర్తిచేశారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పెద్దగొల్లపల్లె గ్రామం నుంచి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగిస్తూ పశ్చిమవాహినిలో గంగపూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలు గుడివంక ఆలయం వద్దకు చేరుకున్నాయి. నేడు శుక్రవారం రాత్రి స్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

## సంతగేటు పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతి

**యాదమరి(పూతలపట్టు):** మండలంలోని సంతగేటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రభావతి ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆరోగ్య కేంద్ర నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, కాన్పులు ఎక్కువ మొత్తంలో ఆరోగ్య కేంద్రంలో చేయాలని వైద్యాధికారికి సూచించారు. ఫార్మసీ ల్యాబ్‌ను పరిశీలించి, ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించే రోగులకు నాణ్యమైన వైద్యను అందించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న లెప్రసీ సర్వేను పరిశీలించారు. వ్యాక్సిన్ సర్వే జరిగే విధానాన్ని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల టీబీ వ్యాధి రాకుండా ఉంటుందని ప్రజలకు తెలియజేశారు.

## నేడు ఆడి ప్రత్యేక అభిషేకాలు

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** నగరంలోని అమ్మవారి ఆలయాల్లో నేడు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఆడి నెల రెండవ శుక్రవారాన్ని పురస్కరించుకుని సంతపేట, మురకంబట్టు, ఇందిరానగర్, ఆటోనగర్, తిమ్మసముద్రంలోని నాగాలమ్మ ఆలయాల్లో జాతర నిర్వహించనున్నారు. ఉదయం అమ్మవారిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పించనున్నారు. రాత్రికి వీధి నాటక ప్రదర్శన ఉంటుందని జాతర పెద్దలు తెలిపారు.

# గెనిసిగడ్డకు మంగళం ప్రసిద్ధి

- విత్తనం లేని పంట
- 50 ఎకరాలలో సేద్యం



మంగళంలో రైతులు ఒబ్బిడి చేసిన గెనిసిగడ్డలు

**పుంగనూరు:** పడమటి మండలమైన పుంగనూరులో ప్రతి సీజన్‌కు రైతులు ఆయా పంటలను పండించడంలో మెలకువలు నేర్చుకున్నారు. సంక్రాంతి, శివరాత్రి పండుగలకు విరివిగా లభించే గెనిసిగడ్డలను ప్రస్తుతం సీజన్లతో పనిలేకుండా పండిస్తున్నారు. ప్రజలందరూ అత్యంత ఇష్టంతో తినడం ప్రజలకు అలవాటు. ఎంతో రుచికరమైన గెనిసిగడ్డలను ఉడకబెట్టి, పిల్లలకు తినిపిస్తే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారన్నది సత్యం. అలాగే పెద్దలు సైతం గెనిసిగడ్డలను తినడంతో అనేక రకాలైన పోషక పదార్థాలు లభిస్తాయి. మండలంలోని మంగళం, గెరిగపల్లి, భీమగానిపల్లి, బోయకొండ ప్రాంతాలలోని రైతులు గెనిసిగడ్డల పంటలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. 100 కుటుంబాలు తరతరాలుగా గెనిసిగడ్డ పంటలు పండించి జీవనం సాగిస్తున్నారు.

**తీగ పంట..**

ఈ పంటకు విత్తనాలు ఉండవు. కేవలం తీగ మొలకలతో పంటను పండిస్తున్నారు. ఎక్కువగా ఈ పంటను ఏడాదికొకసారి అక్టోబర్ నెలలో పండించేవారు. సంక్రాంతి, శివరాత్రి పండుగకు ఈ పంటలు వచ్చి, ప్రజలు వీటిని తినేలా ఏర్పాటు చేసుకునేవారు. ప్రస్తుతం సంవత్సరం పొడవునా ఈపంటను పండిస్తారు.

**సాగు ఖర్చు..**

గెనిసిగడ్డల పంటకు ఎకరానికి రూ.50 వేలు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. నాలుగు నెలల పాటు పంటను సంరక్షించాల్సి ఉంది. అయితే ఆదాయం బాగానే ఉంటుందని రైతులు తెలిపారు. ఎక్కువగా ఈ పంట మెత్తటి నేలలోనే అధిక దిగుబడులు వచ్చి, గడ్డ ఎక్కువ మోతాదులో వస్తే ఆదాయం బాగుంటుంది. అర కిలో బరువు కలిగి ఒక్కొక్క గడ్డ ఉంటుంది. ఇసుక నేలలో పంట అంతగా పండేందుకు అవకాశం ఉండదు. కిలో రూ.50 నుంచి రూ.80ల వరకు ఉంటుంది. బెంగళూరు, చెన్నై, తిరుపతి, నెల్లూరు, విజయవాడ, హైదరాబాద్, కుప్పం ప్రాంతాలకు ఇక్కడ నుంచి గెనిసిగడ్డలను తరలిస్తారు.

**అనేక ఆహార పదార్థాల తయారీ..**

గెనిసిగడ్డలను పిల్లలు, పెద్దలు అనే తేడాలు లేకుండా తియ్యటి రుచికలిగిన పచ్చిగడ్డలను తింటారు. కొంత మంది కాల్చి, మరికొంత మంది బెల్లం నీటిలో, ఉప్పునీటిలో ఉడికించి ఈ గడ్డలను తింటారు. అలాగే ఒబ్బట్లు, సాంబారు, తాలింపునకు ఈ గడ్డలను వినియోగిస్తారు. చక్కర వ్యాధిగ్రస్తులకు ఎలాంటి ఇబ్బందులు ఈ గడ్డల ద్వారా ఉండకపోవడంతో వారు కూడా తింటున్నారు.



బోయకొండ వద్ద విస్తారంగా పండించిన గెనిసిగడ్డ